క్లుప్తంగా

ఘనంగా ఎంపీకి సత్కారం



ఎంపీని సత్కరిస్తున్న వైకాపా యువజన విభాగం కన్వీనర్ కె.రవిశంకర్‌గౌడ్

వేంపల్లె : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని వైకాపా యువజన విభాగం కన్వీనర్ కె.రవిశంకర్‌గౌడ్ ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కె.నరసింహాగౌడ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే జగనన్న భరోసా కార్యక్రమంలో భాగంగా ఆదివారం వేంపల్లె వైఎస్సార్‌సీపీ నేతలు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసి ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్రనేత వేణుగోపాల్, మైనార్టీ నేతలు నిసార్‌బాషా, నసీమ్‌బాషా, ఎంపీటీసీ కటిక చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ నేతల సమావేశం

చక్రాయపేట : ఇడుపులపాయలోని వైఎస్సార్ అతిథిగృహంలో సోమవారం చక్రాయపేట మండల వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమావేశానికి కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి, మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డిలు పాల్గొంటున్నట్లు మండల సమన్వయకర్త ఓబులరెడ్డి తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, బూత్ కన్వీనర్లు, బూత్ మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నేతలు హాజరుకావాలని ఆయన తెలిపారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభం



ఇంటిపై విరిగి పడిన విద్యుత్ స్తంభం

కమలాపురం : పట్టణంలోని తాళింవీధి వద్ద ఆదివారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి పురాతన విద్యుత్ స్తంభం విరిగి ఎదురుగా ఉన్న ఇంటిపై పడింది. సంఘటన తెల్లవారక ముందే జరగడంతో ఆ దారిన ఎవరూ తిరగక పోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. విద్యుత్ స్తంభం ఇంటిపై పడటంతో గేటు నుంచి గోడలకు విద్యుత్ సరఫరా కావడంతో ఇంటి యజమాని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సిబ్బంది అక్కడికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం విద్యుత్ స్తంభాన్ని తొలగించారు.

యువత సేవా మార్గంలో పయనించాలి



రక్తదానం చేస్తున్న యువకులు

పులివెందుల రూరల్ : యువత సేవామార్గంలో పయనించాలని రక్తనిధి మెడికల్ ఆఫీసర్ శుభశ్రీ అన్నారు. అక్టోబర్ 1 జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పులివెందుల పట్టణంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తనిధి, స్నేహిత అమృతహస్తం సేవాసమితి ఆధ్వర్యంలో సుమారు 20 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు రాజు, వైద్యులు తేజ, రక్తనిధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వర్షం కురవగా.. పంట పచ్చగా



పచ్చగా ఉన్న మొక్కజొన్న పంట

రాజుపాళెం : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం తెల్లవారుజామున వర్షం కురిసింది. గత 12 రోజులుగా చినుకు జాడ లేకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. ఆదివారం జోరున వర్షం కురవడంతో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పత్తి, పసుపు, కంది, అరటి, వరి, మినుము, మిరప, మొక్కజొన్న పంటలకు జీవం వచ్చిందని రైతులు చెబుతున్నారు.

రచయిత బొమ్మిశెట్టికి సన్మానం

మైదుకూరు : మైదుకూరుకు చెందిన వన్నూరమ్మ – ఎదురులేని పాలగత్తె పుస్తక రచయిత బొమ్మిశెట్టి రమేష్‌కు అనంతపురం పత్రా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం పట్టణంలోని రుద్రంపేట యాదవ కల్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. అనంతపురం పత్రా కులస్తుల సమ్మేళనం – భవిష్యత్తు కార్యాచరణపై నిర్వహించిన సమావేశంలో వన్నూరమ్మ చరిత్ర రాసిన రమేష్‌ను సంఘం నాయకులు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

ఘనంగా గణనాథుని నిమజ్జనం



జమ్మలమడుగులో కేరళ వాయిద్యాలు, కోలాటాలతో నిమజ్జనానికి తరలిస్తున్న విగ్రహాలు

పులివెందుల టౌన్ : వాడవాడలలో కొలువుదీరిన గణనాథులను భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆదివారం నిమజ్జనానికి తరలించారు. దారిపొడవునా డప్పు వాయిద్యాలతో, రంగులు చల్లుకుంటూ, చిందులు వేస్తూ గణపతిబప్ప మోరియా అంటూ నినాదాలు చేస్తూ నిమజ్జనానికి తరలించారు. ఇందులో మహిళలు ఎంతో ఉత్సాహంగా నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.

నల్లపురెడ్డిపల్లెలో లడ్డూ వేలంపాట

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో వినాయక లడ్డూకు వేలంపాట నిర్వహించారు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 7వ రోజు వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేలంపాటలో గ్రామానికి చెందిన సతీష్ రూ.37 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం గ్రామంలోని ప్రజలు రంగులు చల్లుకుంటూ, డప్పువాయిద్యాల మధ్య గణేష్ నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : నందిమండలం గ్రామంలో ఆదివారం ఘనంగా గణనాథుని నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ఆదివారం ఉదయం వినాయక విగ్రహాలకు అర్చకులు, వేదపండితుల అధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఏడు రోజుల పాటు భక్తులు ప్రత్యేక పూజలు చేసి ఆదివారం సాయంత్రం వినాయకుడి విగ్రహాలను ట్రాక్టర్లలో ఊరేగింపుగా డప్పులు, మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్చుతు యువత నృత్యాలు చేస్తు రంగులు చల్లుకుంటు తీసుకెళ్లారు. చౌడమ్మ విధిలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో లడ్డు వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో పంగా చంద్రశేఖర్ రూ.1.05లక్షలకు లడ్డును దక్కించుకున్నారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని పెద్దపుత్త ఎస్సీ కాలనీలో గణేషుని నిమజ్జన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఏడు రోజులుగా పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ట్రాక్టరులో వుంచి డప్పులు, బ్యాండు మేళ వాయిద్యాల నడుమ, బాణా సంచా పేలుస్తూ పెద్ద పుత్త, దుగ్గాయపల్లె, వెంకటాపురం వీవర్స్ కాలనీ, ధర్మాపురం గ్రామాల మీదుగా ఊరేగింపును నిర్వహించారు. డీజే పాటలతో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పెన్నా నది నీటిలో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎర్రగుంట్ల..

ఎర్రగుంట్ల : మండలంలోని పోట్లదుర్తిలో భారీ ఎత్తు గల వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలించారు. వినాయక నిమజ్జనంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ముందస్తుగా సీఐ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును నిర్వహించారు. గతంలో వినాయక నిమజ్జనంలో ఈ గ్రామంలో అల్లర్లు జరిగాయి. దీంతో బందోబస్తును నిర్వహించారు. ఎస్‌ఐలు కృష్ణంరాజునాయక్, సంజీవరెడ్డిలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణంలోని చాలా వినాయకుడి విగ్రహాలను ఆదివారం ఏడోరోజు కావడంతో భక్తులు ఆదివారం నిమజ్జనానికి తరలించారు. వినాయకుడి చేతిలో పెట్టిన భారీ లడ్డులకు వేలం పాట నిర్వహించారు. అనంతరం మేళతాళాల మధ్య స్వామి వారిని ట్రాక్టర్‌లలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. కన్నెలూరు దర్గా, రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి చేతిలో ఉన్నలడ్డులకు వేలం పాట నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. పట్టణంలోని ఈశ్వరరెడ్డి నగర్‌లో సిద్ధి వినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో లడ్డును వేలం పాట నిర్వహించారు. మొలక రామమోహన్‌రెడ్డి బృందం రూ.70వేలకు లడ్డును దక్కించుకున్నారు.



పులివెందులలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



నందిమండలంలో లడ్డు వేలం పాటలో రూ.1.05 లక్షకు దక్కించుకున్న పంగా చంద్రశేఖర్



వల్లూరు : పెద్దపుత్త ఎస్సీ కాలనీలో గణేషుని గ్రామోత్సవం



పోట్లదుర్తిలో వినాయక నిమజ్జనంలో బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ ఈశ్వరయ్య

డిసెంబర్ 23, 24 తేదీల్లో సాహిత్య సభలు

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 23, 24వ తేదీలలో మహా సభలు నిర్వహించనున్నట్లు అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి తెలిపారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం వైయస్ఆర్ జిల్లా రచయితల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహా సభల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. తొలి రోజు కార్యక్రమంలో ప్రాచీన సాహిత్యం, కవిత, కథానిక, నవల, నాటకం ప్రక్రియలపై సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాల్లో భువన విజయం నాటక ప్రదర్శన, రెండవరోజు కార్యక్రమంలో అవధానం, హాస్యావధానం, కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో సంఘంలోని సీనియర్ సాహితీవేత్తలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, భూమిరెడ్డి స్వరూప రాణి, డాక్టర్ కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డి, డాక్టర్ జి.వి.సాయిప్రసాద్, డాక్టర్ అనుగూరు చంద్రశేఖర రెడ్డి, డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

కథల పోటీలు

పోరుమామిళ్ల : స్థానిక గ్రంథాలయంలో ఆదివారం జేవీవీ జిల్లా కార్యవర్గసభ్యులు ఖాశింవలి, గ్రంథాలయ అధికారి అఫ్రిది ఆధ్వర్యంలో విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఖాశింవలి మాట్లాడుతూ ప్రతి ఆదివారం వివిధ అంశాలపై పోటీ లు నిర్వహించి బహుమతులు ఇస్తామన్నారు. విద్యార్థులు గ్రంథాలయంలోని విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదవాలన్నారు. పెద్దవారంద రూ పుస్తకాలు చదవటం వల్లనే జ్ఞానం సంపాదించారన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సేవా పథకం దినోత్సవం



జాతీయ సేవా పథకం గురించి విద్యార్థులకు వివరిస్తున్న అధ్యాపకులు

పులివెందుల టౌన్ : పులివెందులలోని ఆహారవిజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్.భేగ్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ సేవా పథకం గురించి మునుపటి జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా పనిచేసిన అనుభవాలను వివరించారు. డాక్టర్ రాజేష్, ఏడుకొండలు, జాతీయసేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్లు నివేదిత, నజ్మాలు జాతీయ సేవాపథకం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ద్వితీయ సంవత్సర విద్యార్థినులు కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలను విస్తృతపరచాలి



పులివెందులలో ఆర్థికసాయాన్ని అందజేస్తున్న న్యాయవాది కరుణాకరరెడ్డి, తదితరులు



ఎర్రగుంట్లలో వృద్ధురాలికి నగదు పారితోషం అందిస్తున్న మానవత

పులివెందుల టౌన్ : మానవత స్వచ్ఛంద సేవాసంస్థ తమ సేవలను మరింతగా విస్తృతం చేయాలని న్యాయవాది కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సంబూరి సుబ్బరాయుడు అధ్యక్షతన నిర్వహించిన మానవత సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతభాగస్వామ్యం పెంచాలన్నారు. కార్యక్రమంలో చైర్మన్ డి.వి.కొండారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుడికి ఆర్థిక సాయం

పట్టణానికి చెందిన కళ్యాణ్ అనే మానసిక దివ్యాంగుడికి రూ.16వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. మానవత సంస్థ తరపున రూ.5వేలు, వ్యక్తిగతంగా న్యాయవాది కరుణాకరరెడ్డి రూ.5వేలు, చవ్వాకృష్ణారెడ్డి రూ.5వేలు, పి.కృష్ణమూర్తి రూ.1000ల ఆర్థికసాయాన్ని అందజేశారు. సమావేశంలో మానవత సభ్యులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతామని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండలాధ్యక్షుడు జీరెడ్డి మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం శ్రీగౌతమ్ హైస్కూల్‌లో మానవత స్వచ్ఛంద సేవ సంస్థ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయ రెడ్డిని సన్మానించారు. తర్వాత ఆనారోగ్యంతో బాధపడుతున్న పాపులమ్మ అనే వృద్ధురాలికి రూ.5 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ రాఘురామిరెడ్డి, మావనత సభ్యులు పాల్గొన్నారు.

మొల్లమాంబ శతకం ఆవిష్కరణ

కడప కల్చరల్: మహా కవయిత్రి మొల్లమాంబ ఖ్యాతి మహిళా లోకానికి ఆదర్శమని విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు అన్నారు. మొల్ల సాహితీ పీఠం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని కోటిరెడ్డి సర్కిల్‌లోని మొల్లమాంబ విగ్రహం వద్ద రచయిత మామిళ్ల లోకనాథం రచించిన శతకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొల్లమాంబ జయంతిని ఏటా మార్చి 13న రాష్ట్ర ప్రభుత్వం పండుగగా నిర్ణయించడంతో ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం గానుగపెంట హనుమంతరావును సాహితీ వేత్తలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ భాషా కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, స్వర్ణలత, వై సంజీవరాయుడు, రారాజు, కాల్వ సోము కళానాథ రెడ్డి, పార్వతమ్మ, శివశంకర్, కొండారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర వ్యాప్తంగా ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణు గోపాల్ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలతో 24 గంటలు సర్వేలు చేయించుకుంటూ తగిన భత్యం ఇవ్వకపోవడం తగదన్నారు. హెల్త్ కార్డుల సర్వేని నిర్వహించకుంటే జీతాలు నిలిపివేస్తామని హెచ్చరించడం దారుణమన్నారు. ఆశా కార్యకర్తలకు 15వేల వేతనం, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సుభాషిణి, చంద్రశేఖర్, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు..

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి నేతలు జీవన్ చంద్రశేఖర్, కృష్ణకుమార్ కోరారు. జిల్లా రెవెన్యూ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఆదివారం జిల్లా స్థాయి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ అతి తక్కువ వేతనానికి సమయ పాలన లేకుండా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జేఏసీని బలోపేతం చేసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కడప జిల్లా ఒప్పంద మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా చైర్మన్‌గా తులసీనాథ్(గృహ నిర్మాణ శాఖ), ప్రధాన కా ర్యదర్శిగా వెంకటేష్ (సాంఘిక సంక్షేమ శాఖ), అసోసియేట్ చైర్మన్‌గా గణేష్ (హార్టికల్చర్), కో చైర్మన్‌గా వరపుత్ర (మెడికల్ డిపార్టుమెంట్)లను ఎన్నుకున్నారు.

ఆర్వో ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోండి



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కొండాపురం : ప్రజలు ఫ్లోరైడ్‌తో ఇబ్బందులు పడకుండా ఆర్వో ప్లాంట్‌ను ఎర్పాటు చేశామని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని రేగడిపల్లెలో నూతన ఆర్వో ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గండికోట జలాశయం కింద రేగడిపల్లె గ్రామం ముంపులోకి పోవడంతో గ్రామం చుట్టు బ్యాక్ వాటర్ నిల్వ ఉండటంతో ప్రజలు తాగనీటికి ఇబ్బందులు పడకుండా ఆర్వో ప్లాంట్ ద్వారా శుద్దజలం ఎర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు చింత రాజారెడ్డి, ఉపమండల అధ్యక్షుడు కుమ్మెత చంద్రశేఖర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ శృతి, సర్పంచ్‌లు రాఘవేంద్రరెడ్డి, శివారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, ఆర్.హరినారాయణరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.55 లక్షలతో గ్రేడింగ్ మిషన్ ఏర్పాటు



పులివెందుల వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన గ్రేడింగ్ మిషన్

పులివెందుల రూరల్ : స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సుమారు రూ.55 లక్షలతో చీనీకాయలను గ్రేడింగ్ చేసుకునేందుకు గ్రేడింగ్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ గ్రేడింగ్ మిషన్ నాలుగు సైజుల్లో గ్రేడింగ్ చేస్తుందని వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, సెక్రటరీ రత్నరాజులు తెలిపారు. గంటకు 3 టన్నుల చీనీకాయలను ఈ మిషన్ ద్వారా గ్రేడింగ్ చేసుకోవచ్చన్నారు. గ్రేడింగ్ మిషన్ పులివెందుల వ్యవసాయ మార్కెట్‌లో అందుబాటులో ఉంటుందని, రైతులు పండించిన చీనీకాయలను ఉచితంగా గ్రేడింగ్, క్లీనింగ్ చేసుకోవచ్చని వారు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి



పంట నమోదును పరిశీలిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధిలో ఇప్పటి వరకు 2 వేల ఎకరాలలో ఈ క్రాపు పంట నమోదు జరిగిందని మిగిలిన రైతులు కూడా ఈనెలాఖరులోగా పంటనమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. అదివారం ఆయన మండలంలో సాగు చేసిన పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సుమారు 2200 ఎకరాలలో వ్యవసాయ పంటలను సాగు చేశారు. అందులో 800 ఎకరాలలో పత్తి, 900 ఎకరాలలో వరి, చీనిచెట్లు 900 ఎకరాలలో, మిగిలిన ఎకరాలలో ఇతర పంటలను రైతులు సాగు చేశారన్నారు. ఈ నెలఖారులోగా ప్రతి రైతు వారి సాగు చేసిన పంటను ఈ క్రాప్ చేసుకోవాలన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ



కృత్రిమ అవయవాలు అమర్చుతున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వెంకటేశ్వర్లపేట సరస్వతి విద్యా మందిరంలోని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం 70 మందికి కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, హుబ్లీలోని ఆల్ ఇండియా జైన్ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను అందించడం హర్షణీయమన్నారు.

బుద్ధుని భావజాలం చారిత్రక అవసరం



మాట్లాడుతున్న బౌద్ధ ప్రచారకులు బొర్రా గోవర్ధన్, చిత్రంలో సాంబశివరావు

కడప కల్చరల్: దేశానికి ప్రత్యామ్నాయ భావజాలం అవసరమని బౌద్ధ ప్రచారకులు బొర్రా గోవర్ధన్ పేర్కొన్నారు. కడప నగరంలోని మానస ఇన్ సమావేశ మందిరంలో బుద్ధిస్ట్ కల్చర్ సొసైటీ ఆధ్వర్యంలో భారతీయ తాత్విక చింతనపై ఆదివారం సదస్సు నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ రాజా వెంగళరెడ్డి, ఇంటాక్ చాప్టర్ జిల్లా కన్వీనర్ కె.చిన్నపరెడ్డి ప్రారంభించారు. ప్రధాన వక్త గోవర్ధన్ మాట్లాడుతూ ప్రాచీన కాలంలో మధ్య ఆసియా నుండి వచ్చిన ఆర్యుల్లో తాత్విక దృక్పథం కనిపించదని, లోకాన్ని, మానవ సృష్టికర్త దేవుడని అబద్ధ ప్రచారం చేశారన్నారు. బుద్ధిస్ట్ సాంబశివరావు మాట్లాడుతూ మనిషిని మనిషిగా చూడాలని బుద్ధుని తత్వం తెలియజేస్తుందని తెలిపారు. బౌద్ధం మానవాళికి స్వేచ్ఛ, సమానత్వాలను బోధించిందన్నారు. బుద్ధిస్ట్ భార్గవ్ మాట్లాడుతూ విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలు అభివృద్ధి చెందినా స్వార్థం కోసం మూఢనమ్మకాలను ప్రచారం చేశారన్నారు. డాక్టర్ సి.ఓబుల్ రెడ్డి, కథా రచయిత దాదా హయాత్, బుద్ధిస్ట్ కల్చర్ సొసైటీ అధ్యక్షుడు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి లెనిన్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు మల్లెల భాస్కర్, , సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, సంపత్‌కుమార్, ఎఆర్‌పీ ప్రసాద్, రవిశంకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శివరాం, శివారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేకల శివార్జున

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున డిమాండ్ చేశారు. కడప ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ డీఏలను చెల్లించలేదన్నారు. మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపులో జాప్యం ఉందని, సంపాదిత సెలవులు నగదు రూపేణా తీసుకోవడానికి పెట్టిన బిల్లులు ఇవ్వలేదన్నారు. బదిలీల ద్వారా వెళ్లిన ఉపాధ్యాయులకు మ్యాపింగ్ గాక జూన్ నుంచి ఇంతవరకు జీతాలు అందలేదన్నారు. పలుమార్లు సమాచారం అందించినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అలాగే 11వ పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్‌బాబు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహించిన వాగులు, వంకలు



లింగాల : వెలిదండ్ల సమీపంలో భారీగా ప్రవహిస్తున్న వంక



లింగాల : చెర్లోపల్లె గ్రామంలో పంట పొలాలలో నిలిచిన నీరు

పెండ్లిమర్రి : మండలంలో ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కుంటలు, చెరువులు జలకళలను సంతరించుకున్నాయి. సాగులో ఉన్న చామంతి, అరటి పత్తి, వరి పంటలకు ఊరట లభించిందని రైతున్నలు తెలిపారు. ఉల్లి రైతులు కొందరు నష్టపోయిరు. తిప్పరాజుపల్లె గ్రామానికి వెళ్లె దారిలో వాగు ఉధృతంగా ప్రవహించింది.

వాగులో ట్రాక్టర్, అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు కూలీలు చిక్కుకున్నారు. స్థానికులు గమనించి కూలీలను, ట్రాక్టర్‌ను బయటకు తీశారు. మధ్యాహ్నం వరకు గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.

లింగాలలో కోతకు గురైన రోడ్లు

లింగాల : మండలంలో ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 59.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు తహసీల్దార్ కార్యాలయంలోని రెయిన్‌ఫాల్ ద్వారా రికార్డు అయింది. భారీ వర్షం కురవడంతో లింగాల నుంచి బోనాలకు వెళ్లే ప్రధాన రహదారి కల్వర్ట్ వద్ద కోతకు గురైంది. వెలిదండ్ల నుంచి సింహాద్రిపురం వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న వంక పొంగిప్రవహించడంతో రాకపోకలు స్థంభించిపోయాయి. కె.చెర్లోపల్లె గ్రామంలో అరటి పొలాల్లో భారీగా వరదనీరు చేరాయి. దీంతో అరటి పంటలు దెబ్బతింటాయని రైతులు వాపోతున్నారు. వరదనీరు వంకలకు, వాగులకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో పంట పొలాలు నీట మునుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతకు వచ్చిన టమాట పంటలు కూడా దెబ్బతిన్నాయి.